అట్టహాసంగా సాయి నామినేషన్

- కదిలి వచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేసిన సాయిప్రసాద్‌రెడ్డి
- అడుగడుగునా నీరాజనాలు

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ ఆదోని అసెంబ్లీ అభ్యర్థిగా వై.సాయిప్రసాద్‌రెడ్డి సోమవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం తన స్వగృహం నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి ద్వారకా టాకీస్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా కింగ్స్ ప్యాలెస్, ఎమ్మిగనూరు రోడ్డు, చందసా దర్గా, నిర్మల్ టాకీస్, భీమాస్ సర్కిల్, రైల్వేస్టేషన్ మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. 11.05 గంటలకు నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. అనంతరం కార్యాలయం బయటకు వచ్చారు. కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు, రాజేంద్రప్రసాద్, నరసింహమూర్తి, నియాజ్‌అహ్మద్, దేవా, శ్రీదేవి, లక్ష్మి, శోభాలత తదితరులు పాల్గొన్నారు.

విజయం నాదే

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసి బయటకు వచ్చిన సాయిప్రసాద్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు ఎంతో సేవ చేశానని, అయినా ఇంకా చేయాల్సింది ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పథకాలే మరోసారి తనను కచ్చితంగా గెలిపిస్తాయన్నారు. నాన్ లోకల్ అభ్యర్థులకు ఆదోనిలో చోటు లేదన్నారు.

➡ ముందుగా సాయిప్రసాద్‌రెడ్డి తన నామినేషన్ పత్రాలను ఇంట్లో దేవుళ్ల చిత్రపటాల వద్ద ఉంచి పూజలు చేయించారు. అనంతరం ఎమ్మెల్సీ మధుసూదన్, నాయకులు, కార్యకర్తలతో కలిసి కాలినడకన బయలుదేరారు.


నామినేషన్ వేసి బయటకు వస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్


ర్యాలీలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

నామినేషన్ల ప్రక్రియలో బీవై.రామయ్య

సాయిప్రసాద్‌రెడ్డి నామినేషన్ ప్రక్రియలో కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య పాల్గొన్నారు. ప్రచార రథంపై నుంచి ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఎమ్మెల్యేగా సాయిప్రసాద్‌రెడ్డి అన్నను, ఎంపీగా తనకు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. చంద్రబాబునాయుడి మాదిరిగా కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసం చేయడం జగనన్నకు సాధ్యం కాదని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నే ముఖ్యమంత్రి కావాలని అన్నారు.


ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న బీవై రామయ్య

ఆదోని రూరల్: ఆదోని పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలివచ్చారు. మండిగిరిలో పార్టీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్ ఆధ్వర్యంలో దాదాపు 1,000 మందికి పైగా తరలివచ్చారు. పెద్దతుంబళంలో సర్పంచ్ ఉచ్చప్ప, నాయకులు బసవరాజు, నరసయ్య ఆధ్వర్యంలో, పెద్దహరివాణంలో వైస్ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, నాయకులు మధు, సంతోష్ ఆధ్వర్యంలో, ధణాపురంలో మాజీ సర్పంచ్ ఈరన్నగౌడ్ ఆధ్వర్యంలో, నారాయణపురంలో సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, కపటి, దొడ్డనకేరి, బైచికేరి, ఆరేకల్, సాంబగల్, చిన్నపెండేకల్ తదితర గ్రామాల నుంచి భారీగా తరలివచ్చారు. ర్యాలీలో జై జగన్.. జైజై సాయిప్రసాద్‌రెడ్డి నినాదాలతో పట్టణం మారుమ్రోగింది.


మండిగిరి నుంచి తరలివెళ్తున్న నాయకులు

సాదాసీదాగా బాలనాగిరెడ్డి నామినేషన్

మంత్రాలయం: వైఎస్సార్‌సీపీ మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థిగా వై.బాలనాగిరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు స్థానిక రెవెన్యూ కార్యాలయం చేరుకుని ఆర్వో మురళికి నామినేషన్ పత్రాలు అందజేశారు. శుభ దినం కావడంతో సాదాసీదాగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే టీడీపీ అభ్యర్థిగా ఎన్.రాఘవేంద్రరెడ్డి సైతం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల ప్రక్రియలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమిరెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, ఎమ్మిగనూరు కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురురాజారావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి


అధికారులతో మాట్లాడుతున్న శివనారాయణశర్మ

ఆదోని రూరల్: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ నాటికి పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసేవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంపీడీఓ విజయశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక


పార్టీలో చేరిన వారితో బాలనాగిరెడ్డి

కోసిగి: మండల కేంద్రంలోని కొండుగానీ వీధికి చెందిన టీడీపీ కార్యకర్తలు నాగరాజు, వీరేష్, కోసిగయ్యలతో పాటు మరో 20 కుటుంబాలు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే స్వగృహం రాంపురం గ్రామంలో ఎంపీపీ ఈరన్న, పార్టీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

క్లుప్తంగా

ఈరన్నస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పిండి వంటలను స్వామికి నైవేద్యంగా సమర్పించారు.

ఘనంగా పీఠాధిపతి జన్మదిన వేడుకలు


పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులను సన్మానిస్తున్న మఠం అధికారులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు జన్మదినం వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్వామీజీ జన్మదినం పురస్కరించుకుని సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు తైల అభ్యంగన చేశారు. యాగశాలలో మృత్యుంజయ, ఆయుష్, పవమాన హోమాలు చేపట్టి పూర్ణాహుతి చేశారు. అనంతరం స్వామీజీని శ్రీమఠం అధికారులు, భక్తులు పూలమాలలతో సత్కరించారు.

నేడు హనుమాన్ జయంతి


పూజలందుకున్న వాయుపుత్రుడు

ఆదోని టౌన్: పట్టణంలోని ఫారెస్ట్‌లైన్ వీధిలో అశ్వర్థరామాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గణపతిపూజ, పంచామృతాభిషేకం, మహాయజ్ఞం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పుర వీధుల గుండా మహాకుంభం, రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

సన్మానం


రామలింగప్పను సన్మానిస్తున్న దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని పల్లెపాడు జెడ్పీ పాఠశాల హెచ్ఎం బి.రామలింగప్ప పదవీ విరమణ పొందడంతో సోమవారం ఆయనను పాఠశాల ఆవరణంలో ఎంఈఓ నాగేశప్ప, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు కలిసి ఘనంగా సన్మానించారు. ఎంఈఓ మాట్లాడుతూ రామలింగప్ప మండలంలోని వివిధ పాఠశాలలో 20 ఏళ్లుగా పనిచేసి విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. శేష జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు


దర్గాలో ఫాతెహాలు చేస్తున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

కౌతాళం: మంత్రాలయం ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డి నాల్గవ సారి గెలవాలని కోరుతూ సోమవారం ఆయన కుటుంబ సభ్యులు అనూషరెడ్డి, ప్రియాంకరెడ్డి, కుమారిరెడ్డి కౌతాళం ఖాదర్‌లింగస్వామి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు చేపట్టారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, సర్పంచ్ అవతారం, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, ధర్మకర్త మున్నపాషా చిష్టీ స్వాగతం పలికి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు. బీఫాంను స్వామి సన్నిధిలో ఉంచి ప్రార్థనలు చేశారు. అనంతరం ఉరుకుంద ఈరన్నస్వామిని, బుదుములదొడ్డి ఆంజనేయ స్వామిని దర్శించుకుని బీఫాం ఉంచి ప్రత్యేక పూజలు చేపట్టారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం చెక్‌పోస్టు వద్ద సోమవారం దాసరి శ్రీనివాస్ నుంచి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఇస్పీ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. 576 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు (6 బాక్సులు), బైకును సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల విస్తృత ప్రచారం


నాగులాపురంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న బాలనాగిరెడ్డి కుటుంబ సభ్యులు

మంత్రాలయం/పెద్దకడబూరు: వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వై.బాలనాగిరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కుటుంబ సభ్యులు అనూషరెడ్డి, వీణారెడ్డి, కుమారిరెడ్డి, ప్రియాంకరెడ్డి, మమతరెడ్డి కోరారు. మంత్రాలయం మండలం సింగరాజనహళ్లి, పెద్దకడబూరు మండలం నాగులాపురం గ్రామంలో సోమవారం ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లేసి ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డి ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. వారి వెంట పార్టీ మంత్రాలయం, పెద్దకడబూరు మండలాల కన్వీనర్లు భీమిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ రవిచంద్రరెడ్డి, ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు విజయేంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

➡ **కోసిగి:** ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డిని గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు ముకుంద కృష్ణమూర్తి, గానిగి వీరస్వామి, కొరివి నాగరాజు, కాంట్రాక్టర్ నాగరాజు కోరారు. కోసిగిలోని 9వ వార్డు దుర్గానగర్, వడ్డే గేరి ఏరియాలో ప్రచారం చేశారు.

మద్యం స్వాధీనం

హొళగుంద: మార్లమడికి చెక్‌పోస్ట్ వద్ద సోమవారం 288 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు తెలిపారు. మార్లమడికి చెక్‌పోస్ట్ వద్ద సెబ్ ఎస్‌ఐ రామ్మూర్తితో కలిసి తనిఖీలు చేస్తుండగా హాలహర్వి మండలం విరుపాపురానికి చెందిన వ్యక్తి బైక్‌పై కర్ణాటక నుంచి మద్యం ప్యాకెట్లను తీసుకొస్తూ పోలీసులను చూసి సరుకును, బైక్‌ను అక్కడే వదిలి పరారైనట్లు వెల్లడించారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి మద్యం ప్యాకెట్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వలంటీర్ల రాజీనామా

ఆదోని రూరల్: మండలంలోని 13 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయశేఖర్‌రావుకు రాజీనామా పత్రాలను అందజేశారు. తమను ఎన్నికల విధులకు, పింఛన్ల పంపిణీకి దూరం పెట్టడంతో మనస్తాపంతో రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు తెలిపారు.

కౌతాళం: మండల కేంద్రానికి 28 మంది, ఉప్పరహాల్ గ్రామానికి చెందిన 11 మంది వలంటీర్లు సోమవారం తమ రాజీనామాలను ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తాకు అంజేశారు. అలాగే బాపురం గ్రామానికి చెందిన ఒకరు, కుంబళనూరుకు చెందిన ఐదుగురు వలంటీర్లు కూడా రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు సమర్పించారు.

వ్యాపారవేత్త కన్నుమూత


నరసింహారెడ్డి

ఆదోని టౌన్: పట్టణంలో ప్రముఖ పారిశ్రామికవేత్త గాజుల నరసింహారెడ్డి(75) సోమవారం కన్నుమూశారు. ఆయన పార్థివదేహంపై వ్యాపారులు, బంధువులు పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో ఖాసీంసాబు ఉరుసు


పాతెహాలు నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రంలోని ఖాసీంసాబు ఉరుసు సోమవారం ఘనంగా జరిగింది. ఆదివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు గంధం ఊరేగింపు నిర్వహించారు. గంధం దర్గాకు చేరిన తర్వాత ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించడంతో ఉరుసు ఉత్సవం ప్రారంభమైంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మెరిసిన మాణిక్యాలు

- పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల హవా
- బీసీ గురుకుల పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత

పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరిశారు. అధిక మార్కులు సాధించి ఔరా అనిపించారు. ప్రైవేట్‌కు దీటుగా రాణించి అటు ఉపాధ్యాయులకు.. ఇటు తల్లిదండ్రులకు పేరు తెచ్చారు. బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు వంద శాతం, అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులు 93 శాతం ఉత్తీర్ణతను సాధించారు.


త్రివేణి

ఆదోని సెంట్రల్: నియోజకవర్గంలోని ప్రభుత్వ, పురపాలక, ఎయిడెడ్ పాఠశాలలు 22 ఉన్నాయి. సోమవారం విడుదలైన పరీక్ష ఫలితాల్లో ఆయా పాఠశాలలకు చెందిన 2,438 మంది విద్యార్థులకు గానూ 1,308 మంది విద్యార్థులు పాసై 54 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాధికారులు తెలిపారు. ఆరెకల్లులోని ఏపీ మహాత్మా జ్యోతిరావ్ పూలే బీసీ గురుకుల పాఠశాల 76 మందికి గానూ 76 మంది పాసైసయ్యారు. అందులో త్రివేణి 593/600 మార్కులను సాధించగా హరిప్రియ 591 మార్కులను సాధించింది. ఆరెకల్లు అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో 93 శాతం ఉత్తీర్ణతను సాధించారు. అందులో కీర్తన 568 మార్కులు సాధించింది. ఇక పట్టణ పురపాలక ఉన్నత పాఠశాలలో 48 శాతం ఉత్తీర్ణత సాధించారు. అందులో ధనుంజయ 590 మార్కులు సాధించాడు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 58 శాతం ఉత్తీర్ణత సాధించారు. అందులో సౌమ్య 575 మార్కులు సాధించింది. నెహ్రూమెమోరియల ఉన్నత పాఠశాలలో 43 వాతం ఉత్తీర్ణత సాధించారు. అందులో బి.కళ్యాణి 582 మార్కులను సాధించగా ఎం.నందిని 571 మార్కులను సాధించారు. ఆర్ఆర్ లేబర్ కాలనీలోని పురపాలక ఉన్నత పాఠశాలలో 61 శాతం ఉత్తీర్ణత సాధించారు. అందులో హరిక్రిష్ణ 568, సౌమ్య 554, లావణ్య 552 మార్కులను సాధించారు. జనరల్ కేజీబీవీలో 71 శాతం ఉత్తీర్ణత సాధించగా వెంకటేశ్వరి 511 మార్కులతో పాసైంది. మైనార్టీ కేజీబీవీలో 78 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా హఫీజా 558 మార్కులు తెచ్చుకుంది.


ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు


కీర్తన


కే.ధనుంజయ


హారిక

సత్తా చాటిన విద్యార్థులు


భీరప్ప


మడివేలు


ధరణి శ్రీ

మంత్రాలయం: పదవ తరగతి ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మండలంలో రచ్చుమర్రి ఏపీ ఆదర్శ పాఠశాల విద్యార్థి భీరప్ప 563, మంత్రాలయం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి మడివేలు 551, వగరూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి బండా ఉదయ్ 523, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థిని ధరణిశ్రీ 516 మార్కులు సాధించారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

64.68 శాతం ఉత్తీర్ణత


దివాకర్


కే.లక్ష్మిదేవి

పెద్దకడబూరు: పదవ తరగతి ఫలితాల్లో మండల వ్యాప్తంగా 380 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అందులో 193 మంది విద్యార్థులు పాసు కావడంతో 64.68 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏపీ మోడల్ స్కూల్‌లో 93.50 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా విద్యార్థిని పీహెచ్ శ్రేయ 563 మార్కులు సాధించింది. జెడ్పీ పాఠశాలలో 35.60 శాతం ఫలితాలు నమోదుకాగా బి.దివాకర్ 560 మార్కులు సాధించాడు. కేజీబీవీలో 72.73 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా కే.లక్ష్మిదేవి 519 మార్కులు సాధించింది. ఇక కంబలదిన్నె ఉన్నత పాఠశాల 50 శాతం, చిన్నతుంబళం ఉన్నత పాఠశాల 42.11 శాతం, హెచ్‌మురవణి ఉన్నత పాఠశాల 33.33 శాతం, గవిగట్టు ఉన్నత పాఠశాల 25 శాతం, కల్లుకుంట ఉన్నత పాఠశాల 16.67 శాతం ఫలితాలు నమోదైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

కోసిగి మండలంలో 56.65 శాతం..


మంగలి శ్రీనివాసులు


ఉప్పర చరణ్ సాగర్


బి. వరలక్ష్మి

కోసిగి: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు మంచి మార్కులతో ప్రతిభ చాటారు. మండల వ్యాప్తంగా 826 మంది పరీక్షలు రాయగా 468 మంది మంది విద్యార్థులు పాసు కావడంతో 56.65 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు మండల విద్యాధికారి నాగేశప్ప తెలిపారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి మంగలి శ్రీనివాసులు 575, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి ఉప్పర చరణ్ సాగర్ 573, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.వరలక్ష్మి 551 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కౌతాళం మండలంలో 36 శాతం..


అల్లిపీరా


ఖాదర్‌బాషా


యశోద


వీణా

కౌతాళం: పదవ తరగతి ఫలితాల్లో మండలం 36 శాతం ఉత్తీర్ణ సాధించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా 917 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 331 మంది పాసయ్యారు. బదినేహాల్ జెడ్పీ పాఠశాల విద్యార్థి అల్లిపీరా 546, ఖాదర్‌బాషా 536, యశోద 531 మార్కులు సాధించారు. కౌతాళం జెడ్పీ పాఠశాల 23.58 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా నేహ 531 మార్కులు సాధించింది. నదిచాగి జెడ్పీ పాఠశాల విద్యార్థిని 519 మార్కులు సాధించింది. నదిచాగి 82, రొడూరు 71, ఉప్పరహాల్ 58, బాపురం 36, కామవరం 29.35 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎంలు తెలిపారు.

వైభవంగా వీరభద్రస్వామి కల్యాణం


భద్రకాళి సమేత వీరభద్రస్వామికి హారతి ఇస్తున్న పూజారి


భద్రకాళికి, వీరభద్రస్వామికి కల్యాణం జరుపుతున్న వేద పండితులు

ఆదోని అర్బన్: వీరశైవుల ఆరాధ్యదైవం భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ దేవిశెట్టి మంజునాథ్ ఆధ్వర్యంలో స్వామివార్లకు మహాగణపతి పూజ, ధ్వజారోహణం, రుద్రాభిషేకం, రుద్రవీర భద్రకాళి హోమం, కుంకుమార్చన కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భద్రకాళి సమేత వీరభద్రస్వామి వార్లకు కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

ఘనంగా అంతర్జాతీయ ధరిత్రీ దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: అంతర్జాతీయ ధరిత్రీ దినోత్సవాన్ని సోమవారం విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి ఎమ్మిగనూరు సర్కిల్ మీదుగా కోట్ల కూడలి, మున్సిపల్ మెయిన్ రోడ్డు, అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రకృతిలో భాగమైన భూమి, గాలి, చెరువులు, నదులు, అడవులు, ఖనిజ సంపద కలుషితమవుతున్నాయని, ప్రభుత్వాలు పర్యావరణాన్ని కాపాడకపోతే జీవరాశులు అంతరించిపోతాయని విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు యు.జి. శ్రీనివాసులు, సుజ్ఞానమ్మ, తిరుమలేష్, సోమశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్, నవీన్, బాలు, ఆదినారాయణ, నరసన్న, శంకరన్న, గంగన్న పాల్గొన్నారు.